క్లుప్తంగా

మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూకు నివాళి



కోరుట్ల: మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ నాయకులు సోమవారం ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. కోరుట్ల పట్టణంలోని జువ్వాడి భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్, గంగాదర్ గౌడ్, రాజం, రిజ్వాన్, ఎండీ రఫీ తదితరులున్నారు.

'కోరుట్ల ఎమ్మెల్యేపై అనర్హత వేటు వేయాలి'

మెట్‌పల్లిరూరల్: కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు ఫోన్‌ను ట్యాప్ చేసినవారిపై చర్య తీసుకోవాలని మెట్‌పల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి కోరారు. సోమవారం ఆయన మెట్‌పల్లిలో మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గంలో కాంగ్రెస్ ముందంజలో ఉందన్న భయంతోనే ప్రస్తుత ఎమ్మెల్యే సంజయ్, మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు నర్సింగరావు ఫోన్‌ను ట్యాప్ చేయించి, స్థానిక నాయకులను బెదిరించారని ఆరోపించారు. ఎమ్మెల్యే సంజయ్‌పై అనర్హత వేటు వేయాలన్నారు.

శ్రీవాణికి నవరస నాట్య మయూరి అవార్డు



కోరుట్ల: పట్టణంలోని మీనాక్షి నృత్య కళా నిలయం నాట్య గురువు తోట శ్రీవాణి నవరస నాట్య మయూరి అవార్డు అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని చిలకలూరిపేట కళానిలయం ఆధ్వర్యంలో ఆదివారం జాతీయ స్థాయి నృత్య పోటీల్లో మీనాక్షి నృత్య నిలయం విద్యార్థినులు కుమ్మరి శ్రీ గాయత్రి, వంగల శ్రీనిధి ప్రతిభ కనబరిచారు. శ్రీవాణి, విద్యార్థినులను ఎమ్మెల్యే సంజయ్ సోమవారం అభినందించారు.

నేడు మల్లాపూర్ సర్వసభ్య సమావేశం

మల్లాపూర్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ కాటిపెల్లి సరోజన అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాజేందర్‌రెడ్డి తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్‌కుమార్ హాజరుకానున్నారని, ప్రభుత్వ శాఖల పనితీరు, మండల అభివృద్ధి, సమస్యలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

1.46 లక్షల క్వింటాళ్ల ధాన్యం సేకరణ

పెగడపల్లి: స్థానిక సహకార సంఘం ఆధ్వర్యంలో వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా సోమవారం వరకు 1.46 లక్షల క్వింటాళ్ల ధాన్యం సేకరించినట్లు సీఈవో గోపాల్‌రెడ్డి తెలిపారు. పెగడపల్లిలో 30,877, ఆరవెల్లిలో 22,405, లింగాపూర్‌లో 11,478, వెంగళాయిపేటలో 8,350, కొండాయపల్లిలో 11,716, శాలపల్లిలో 7,878, దోమలకుంటలో 11,712, మద్దులపల్లిలో 18,646, ఏడుమోటలపల్లిలో 12,624, సుద్దపల్లిలో 10,499 క్వింటాళ్లు సేకరించి, మిల్లర్లకు చేరవేసినట్లు పేర్కొన్నారు.

శృతికి బ్లాక్‌బెల్ట్



జగిత్యాల: బీర్‌పూర్ మండలంలోని తుంగూరుకు చెందిన గొల్లపల్లి శృతి కరీంనగర్‌లో ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన కటా, కుమిటీ పరీక్షల్లో ప్రతిభ కనబర్చింది. సోమవారం కరీంనగర్ రూరల్ ఏసీపీ వెంకటరమణ, చీఫ్ ఎగ్జామినర్ వసంత్‌కుమార్ చేతుల మీదుగా బ్లాక్‌బెల్ట్ అందుకుంది.

అంగన్‌వాడీ భవన పనులు పూర్తి చేయాలి



పెగడపల్లి: ఏడుమోటలపల్లి తాండాలో అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులను పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు. గోడలతోనే దర్శనమిస్తున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం లేకపోవడంతో పక్కనే ఉన్న పాఠశాలలోని ఓ గదిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫలితంగా వసతులు లేక చిన్నారులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

భీమన్నకు అభిషేకం



సారంగాపూర్: మంగేళ గోండుగూడెంలో భీమన్న జాతర ఉత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. భీమన్న దేవునికి ఆదివాసీలు సోమవారం గోదావరి జలాలతో అభిషేకం నిర్వహించారు. సంప్రదాయ నృత్యాలతో సందడి చేశారు. కార్యక్రమంలో పటేల్ పెంద్రం జలపతి, అర్క భీము, పెంద్రం సీతారాము, పుర్క రామచందర్, భీమ్‌రావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బీరయ్య ఉత్సవాలు



పెగడపల్లి: మండలంలోని రామభద్రునిపల్లిలో కుర్మ, యాదవుల ఆరాధ్య దైవమైన బీరయ్య దేవుని ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. సోమవారం మహిళలు స్వామివారికి బోనాలతో మొక్కులు చెల్లించుకున్నారు. ఐదు రోజులపాటు జరిగే వేడుకలకు బంధుమిత్రుల రాకతో అందరి ఇళ్లలో పండుగ వాతావరణం నెలకొంది.

పదివేల లింగాల ప్రతిష్ఠ



బుగ్గారం: గ్రామ శివారు అర్పికోట అటవీ ప్రాంతంలో నిర్మించిన శివాలయంలో ద్వాదశ ద్వికోటి లింగాల ప్రతిష్ఠ కార్యక్రమం కొనసాగుతోంది. సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులచే ఆలయ పూజారి రిషి ఆధ్వర్యంలో పదివేల లింగాలను ప్రతిష్ఠించారు. ఆలయ వ్యవస్థాపకుడు లక్ష్మీనారాయణ స్వామీజీ మాట్లాడుతూ.. భగవంతుని కార్యక్రమాల్లో భక్తుల భాగస్వామ్యం పెరిగేలా చూడటమే తమ ఉద్దేశమన్నారు. భక్తిభావంతోనే జీవన విధానంలో మార్పు వస్తుందని తెలిపారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు



చిట్టాపూర్‌లో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ లావణ్య



కోరుట్ల ఫర్టిలైజర్ షాప్‌లో తనిఖీ చేస్తున్న సీఐ సురేశ్‌బాబు, ఏవో నాగమణి

కోరుట్ల రూరల్: రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని కోరుట్ల సీఐ, టాస్క్‌ఫోర్స్ అధికారి సురేశ్‌బాబు, ఏవో నాగమణి హెచ్చరించారు. కోరుట్ల పట్టణంలోని పలు ఫర్టిలైజర్ షాపుల్లో సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రికార్డులు పరిశీలించి, రైతులకు రశీదులు ఇవాలని, స్టాక్ బోర్డులు పెట్టాలని ఆదేశించారు. కోరుట్ల రూరల్ మండలంలోని సంగెం, అయిలాపూర్, జోగిన్‌పల్లి, గుమ్లాపూర్, వెంకటాపూర్ గ్రామాల్లో ఏవో నాగమణి సోమవారం నకిలీ విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించారు. లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని, లూజ్ విత్తనాలు కొనవద్దని, రశీదు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ఏఈవోలు నరేశ్, మమత, సంధ్యారాణి, రాఘవేంద్ర పాల్గొన్నారు.

మల్లాపూర్: నాణ్యమైన విత్తనాలనే రైతులు కొనుగోలు చేయాలని కోరుట్ల ఏడీఏ లావణ్య అన్నారు. సోమవారం మల్లాపూర్ మండలం చిట్టాపూర్, మొగిలిపేట, గొర్రెపల్లి, పాతదాంరాజుపల్లి గ్రామాల్లో వ్యవసాయ అధికారులతో కలిసి రైతులకు అవగాహన కల్పించారు. రైతులు కొనే విత్తనాలకు సంబంధించిన బిల్(రశీదు) తీసుకోవాలన్నారు. డీలర్ వద్ద మాత్రమే విత్తనాలు కొనాలని సూచించారు. పంటకాలం పూర్తయి దిగుబడి వచ్చే వరకు రశీదు రైతు వద్దే భద్రపరుచుకోవాలని పేర్కొన్నారు. ఎవరైనా నకిలీ విత్తనాలు విక్రయిస్తే వ్యవసాయశాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. ఏఈవోలు గజానంద్, సంధ్య, సాయిప్రియ, నవిత, అనిల్, రైతులు పాల్గొన్నారు. మల్లాపూర్ మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో ఫర్టిలైజర్ షాపులను ఏఎస్సై లక్ష్మయ్య, ఏఈవో గజానంద్ సోమవారం తనిఖీ చేశారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని నిర్వాహకులను హెచ్చరించారు.

బుగ్గారం: రైతులు నకిలీ విత్తనాలు కొని మోసపోవద్దని డీఏవో రాంచంద్రం అన్నారు. సోమవారం బుగ్గారం మండలంలోని శెకెల్ల గ్రామంలో విత్తనాల కొనుగోలుపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. విత్తనాలు కొనుగోలు చేస్తే తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని, అధీకృత డీలర్ల వద్దనే కొనుగోలు చేయాలని సూచించారు. ప్యాకింగ్ లేకుండా అమ్మే విత్తనాలను ఎట్టిపరిస్థితుల్లో తీసుకోవద్దని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈవో శ్రీనివాస్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కథలాపూర్: మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపులను పోలీస్, వ్యవసాయశాఖ అధికారులు సోమవారం తనిఖీ చేశారు. స్టాక్, రికార్డులను పరిశీలించారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా రశీదులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏవో యోగిత, హెడ్‌కానిస్టేబుల్ మధుకర్, ఏఈవో రవళి పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను ఏవో దీపిక, పోలీసు అధికారులు సోమవారం తనిఖీ చేశారు. విత్తనాలు, ఎరువులను కాలం చెల్లినవా లేదా అని పరిశీలించారు. కార్యక్రమంలో ఏఎస్సై జమీల్, సొసైటీ సీఈవో మంత్రి సతీశ్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. రైతులు నాణ్యమైన విత్తనాలనే కొనుగోలు చేయాలని ఏవో దీపిక అన్నారు. కొజన్‌కొత్తూర్, కేశాపూర్, మూలరాంపూర్, డబ్బా, కొమటికొండాపూర్, తిమ్మాపూర్, తిమ్మాపూర్ తండాల్లో వ్యవసాయ అధికారులు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఏఈవోలు నరేశ్, హరీశ్, రవళిక, శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు.

సారంగాపూర్: నకిలీ విత్తనాలను అమ్మితే కఠినచర్యలు తీసుకుంటామని జగిత్యాల రూరల్ సీఐ ఆరిఫ్ అలీఖాన్, బీర్‌పూర్ మండల వ్యవసాయాధికారిణి అనూష అన్నారు. సోమవారం బీర్‌పూర్, కొల్వాయి, నర్సింహులపల్లె గ్రామాల్లోని ఎరువులు,, విత్తన దుకాణాలను టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీ చేసింది. ప్రభుత్వం సర్టిఫై చేసిన విత్తనాలనే అమ్మాలని, లైసెన్స్ కలిగి ఉండాలని నిర్వాహకులకు సూచించారు. ఏఎస్సై గజేందర్ తదితరులున్నారు. సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లోని పోతారం, సారంగాపూర్, బీర్‌పూర్, కోమన్‌పల్లి, కమ్మునూర్, మంగేళ గ్రామాల్లో సోమవారం రైతులకు విత్తనాల కొనుగోలుపై వ్యవసాయాధికారులు అవగాహన కల్పించారు. సర్టిఫైడ్ విత్తనాలు కొనాలని సూచించారు. ఏవోలు తిరుపతినాయక్, అనూష, ఏఈవో వెంకటేశ్, ఆంజనేయులు తదితరులున్నారు.

మల్యాల: మండల కేంద్రంలోని పలు విత్తనాల దుకాణాల్లో పోలీసులు సోమవారం సోదాలు నిర్వహించారు. స్టాక్ రిజిస్టర్లను, విత్తనాల బ్యాగులు, వాటి కాలపరిమితిని పరిశీలించారు. కార్యక్రమంలో సీఐ రవి, ఎస్సై అబ్దుల్ రహీం, మల్యాల ఏవో చంద్రదీపక్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురి: నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని సీఐ రాంనర్సింహారెడ్డి హెచ్చరించారు. ధర్మపురి పట్టణంలోని వివిధ విత్తన దుకాణాల్లో సోమవారం ఏవో ముక్తేశ్వర్‌తో కలిసి తనిఖీలు చేపట్టారు. లైసెన్స్ లేకుండా విత్తనాలు, పురుగు మందులు విక్రయించొద్దన్నారు. తక్కువ ధర అంటూ నకిలీ విత్తనాలను అంటగడతారని, అటువంటివారు గ్రామాల్లోకి వస్తే సమాచారం ఇవ్వాలని రైతులకు సూచించారు. ఎస్సై ఉదయ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

కొండగట్టు: కొడిమ్యాల మండలంలోని నల్లగొండ, పూడూర్, నాచుపెల్లి, అప్పారావుపేట, దమ్మయ్యపేట గ్రామాల్లో వ్యవసాయ అధికారులు విత్తనాల కొనుగోలుపై సోమవారం రైతులకు అవగాహన కల్పించారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేస్తే రశీదు తీసుకోవాలని, అపరిచిత వ్యక్తుల వద్ద కొనవద్దని సూచించారు. ఏవైనా సమస్యలుంటే వెంటనే వ్యవసాయధికారికి ఫిర్యాదు చేయాలన్నారు. కొడిమ్యాల మండల కేంద్రంలోని విత్తనాలు, ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయాధికారిణి జ్యోతి, ఎస్సై సందీప్ సోమవారం తనిఖీ చేశారు. షాపుల్లో ధరల పట్టిక ఉంచాలని, తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని సూచించారు. ఏఈవోలు శ్రీనివాస్, గ్రీష్మ, మంజుల, మాధవ్ పాల్గొన్నారు.

వెల్గటూర్: చెగ్యాం క్లస్టర్ పరిధిలోని చెగ్యాం, ముత్తునూర్ గ్రామాల్లో ఏఈవో ఫిర్దోజ్ రైతులకు విత్తనాల కొనుగోలుపై సోమవారం అవగాహన కల్పించారు. లైసెన్స్ ఉన్న షాపులోనే, బీటీ–2 పత్తి విత్తనాలు మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు.

రాయికల్: విత్తనాల కొనుగోలు సమయంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని ఏవో ముక్తేశ్వర్ అన్నారు. సోమవారం ఇటిక్యాల, రామాజీపేట, కుమ్మరిపల్లి, మైతాపూర్, అల్లీపూర్, ఆలూరు, రాజనగర్ గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించారు. ఏఈవోలు పద్మావతి, రాజేశ్, మతాయి, సృజన, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులున్నారు.

మున్నూరుకాపు నాయకులు ఐక్యంగా ఉండాలి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



రాజశేఖర్‌ను సత్కరిస్తున్న విప్ ఆది శ్రీనివాస్

జగిత్యాల/జగిత్యాలజోన్: మున్నూరుకాపు సంఘం నాయకులు ఐక్యంగా ఉండి, సమస్యలు పరిష్కరించుకోవాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన ఒడ్నాల రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి చిట్ల రమణ సోమవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. విప్ వారిని సత్కరించారు. అనంతరం వారు జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంతను కలిశారు. కార్యక్రమంలో నాయకులు రాచకొండ శ్రీరాములు, సొల్ల భీమన్న, వెంకన్న, రాజేందర్, సత్తన్న, రాజిరెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' సామాజిక తనిఖీ ప్రజావేదిక



రికార్డులు పరిశీలిస్తున్న అదనపు డీఆర్డీవో మదన్‌మోహన్

ధర్మపురి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. అదనపు డీఆర్డీవో మదన్‌మోహన్ ఆధ్వర్యంలో ధర్మపురి మండలంలోని 25 గ్రామాల్లో 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 26 వరకు రూ.4.33 కోట్ల పనులు చేపట్టినట్లు తెలిపారు. తనిఖీ బృందాలు పనులను పరిశీలించి కూలీలకు చెల్లించిన వేతనాలపై నివేదిక సమర్పించారు. హరితహారంలో నాటిన మొక్కలు ఎండిపోయినట్లు తేల్చారు. వాటి స్థానంలో కొత్తవి నాటాలని సూచించారు. ప్రతీ నెల 4వ శుక్రవారం రోజ్‌గార్ దివస్ గ్రామసభలు నిర్వహించాలని, లేకపోతే పంచాయతీ కార్యదర్శులపై చర్యలుంటాయని హెచ్చరించారు. పొరపాట్లు చేసిన కార్యదర్శులకు రూ.26,433, సీవోలకు రూ.1,499, టీఏలకు రూ.5,837, ఎఫ్ఏలకు రూ.2,180 జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్డీఏ విజిలెన్స్ అధికారి చిన్నయ్య, విజిలెన్స్ అసిస్టెంట్ మేనేజర్ దేవేందర్‌రెడ్డి, ఎంపీడీవో రవీందర్, ఏపీవో సుజన్ తదితరులు పాల్గొన్నారు.

నమిలికొండలో మట్టి అక్రమ తరలింపు?



జాఫర్‌ఖాన్ చెరువు నుంచి మట్టి తరలిస్తున్న వాహనాలు

కొండగట్టు: కొడిమ్యాల మండలంలోని నమిలికొండ జాఫర్‌ఖాన్, పాలిపెల్లి చెరువుల్లో నుంచి 12 రోజులుగా అనుమతికి మించి మట్టిని అక్రమంగా తరలిస్తున్నారని కిసాన్‌మోర్చా మండల అధ్యక్షుడు, పూడూర్ పీఏసీఎస్ డైరెక్టర్ బండ నర్సింహారెడ్డి ఆరోపించారు. అధికారులు కొన్ని క్యూబిక్ మీటర్లకు మాత్రమే అనుమతి ఇచ్చారన్నారు. కాంట్రాక్టర్లు మాత్రం రూ.లక్ష చలానా కట్టి, రూ.కోట్ల విలువైన మట్టిని తీస్తూ, ఉమ్మడి జిల్లాలోని ఇటుక బట్టీలకు విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. మండల రైతులు చలనా కట్టి, మట్టిని తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. తవ్వకాలను ఆపకపోతే వారితో కలిసి అడ్డుకుంటామని హెచ్చరించారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల డిమాండ్లు నెరవేర్చాలి



మాట్లాడుతున్న మహేశ్

జగిత్యాల: జాతీయ ఆరోగ్య మిషన్(ఎన్‌హెచ్‌ఎం) కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల డిమాండ్లు నెరవేర్చాలని ఏఐటీయూసీ జిల్లా ఇన్‌చార్జి వెన్న మహేశ్ అన్నారు. సోమవారం జగిత్యాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రెగ్యులరైజ్ చేయడంతోపాటు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, హెల్త్ ఇన్సూరెన్స్ ఇవ్వాలని కోరారు. వయసుతో నిమిత్తం లేకుండా 80 శాతం వెయిటేజీతో రెగ్యులర్ నియామకాలు చేపట్టాలని, ఖాళీలను వెంటనే భర్తీ చేయాలన్నారు. నాయకులు పాల్గొన్నారు.

కల్వర్టుకు మరమ్మతు చేయరూ!



కథలాపూర్: మండలంలోని తాండ్ర్యాల–గంభీర్‌పూర్ గ్రామాల మధ్య లో లెవెల్ కల్వర్టు 10 నెలల క్రితం కురిసిన వర్షాలకు ఒకవైపు కోతకు గురైంది. దీంతో రాకపోకలకు వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. రాత్రివేళల్లో ప్రమాదాలకు గురవుతామని భయాందోళన చెందుతున్నారు. మరో 10 రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని, అధికారులు స్పందించి, త్వరగా మరమ్మతు చేయించాలని రెండు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

విద్యతోనే మహిళా సాధికారత సాధ్యం



ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న మహిళా సాధికారత సభ్యులు

సారంగాపూర్: ప్రతీ బాలికను చదివించాలని, విద్యతోనే మహిళా సాధికారత సాధ్యమని జిల్లా మహిళా సాధికారత బృందం సభ్యులు అన్నారు. బేటీ బచావో–బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా సోమవారం సారంగాపూర్ మండలంలోని లక్ష్మీదేవిపల్లి శివారులో ఉపాధిహామీ కూలీలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. పురుషులకు దీటుగా మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, ఇందుకోసం అమ్మాయిలను ఉన్నత చదువులు చదివించాలని పేర్కొన్నారు. దీనివల్ల సమాజంలో గుర్తింపు, ఆర్థికంగా ఎదిగే అవకాశం ఉంటుందని తెలిపారు. అవసరమైనప్పుడు సఖి, 181, 1098 చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్లకు ఫోన్ చేస్తే అధికారులు స్పందిస్తారన్నారు. బాల్యవివాహాల వల్ల జరిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో సభ్యులు గౌతమి, హేమశ్రీ, ఈజీఎస్ ఏపీవో శ్రీలత, టెక్నికల్ అసిస్టెంట్ శివ, ఫీల్డ్ అసిస్టెంట్ రవి తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాలు సరఫరా చేయాలి

మల్యాల: రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు సరఫరా చేయకపోతే వారి పక్షాన పోరాటం చేస్తామని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఒక ప్రకటనలో అన్నారు. పచ్చిరొట్ట విత్తనాలు అందక అన్నదాతలు నానాతంటాలు పడుతున్నారని తెలిపారు. తక్షణమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

రైస్‌మిల్లులో చోరీకి యత్నం

రాయికల్: పట్టణంలోని చెన్నకేశవనగర్ మినీ రైస్‌మిల్లులో ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి యత్నించారు. డోర్ పగులగొట్టి లోపలికి వెళ్లినవారికి డబ్బులు దొరక్కపోవడంతో వెళ్లిపోయారని బాధితుడు రాపర్తి రవి తెలిపారు. సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

మల్యాల: మండలంలోని గుడిపేట శివారులో పేకాట స్థావరంపై పోలీసులు సోమవారం దాడి చేశారు. రూ.5,100 స్వాధీనం చేసుకొని, పేకాడుతున్న ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అబ్దుల్ రహీం తెలిపారు.

క్రీడాదుస్తులు అందజేత



క్రీడాదుస్తులు అందిస్తున్న కానిస్టేబుల్ కృష్ణ

వెల్గటూర్: మండల కేంద్రానికి చెందిన కానిస్టేబుల్ వంగ కృష్ణ స్థానిక హైస్కూల్లోని వేసవి శిక్షణ శిబిర క్రీడాకారులకు సోమవారం క్రీడాదుస్తులు అందజేశారు. కోచ్ కాంపెల్లి సతీశ్, పెద్దూరి భరత్, మేరుగు నరేశ్, జూపాక ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత చదవాలి



శిక్షణ పొందుతున్న మహిళలు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని శ్రీ అయ్యప్పస్వామి దేవాలయంలో భగవద్గీత శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. అందరూ భగవద్గీత చదవాలని నిర్వాహకులు రవీందర్, వెంకన్న, కళ సూచించారు. జూన్ 9 వరకు తరగతులు నిర్వహిస్తామన్నారు.

మహిళలకు అండగా సఖీ కేంద్రం



ధర్మపురి: సమస్యల పరిష్కారంలో సఖీ కేంద్రం మహిళలకు అండగా ఉంటుందని సఖీ కేసు వర్కర్ శారద, పారామెడికల్ వర్కర్ రజిత అన్నారు. ధర్మపురిలోని శ్రీ చైతన్య మండల సమాఖ్య కార్యాలయంలో సోమవారం తేజస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సఖీ కేంద్ర సేవలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమాజంలో స్త్రీలు, బాలికలు ఎదుర్కొంటున్న వేధింపులు, హింసను నిరోధించడానికే సఖీ కేంద్రం ఏర్పాటైందని తెలిపారు. అత్యవసర సమయంలో 181, 1098, 14567 హెల్ప్‌లైన్ నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. డీపీఎం విజయభారతి, ఏపీఎం రమాదేవి, మండల సమాఖ్య అధ్యక్షురాలు సరిత, ఎంఎస్‌సీసీలు ఇందిర, శ్రీనివాస్, గంగాధర్ తదితరులున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జగిత్యాల: మంగళవారం ఉదయం 7.30 గంటల నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చల్‌గల్ ఏఈ శ్రీధర్ తెలిపారు. 33/11 కేవీ సబ్‌స్టేషన్ వాటర్‌వర్క్స్ పరిధిలో 11 కేవీ ఇండస్ట్రియల్ ఫీడర్‌లో విద్యుత్ లైన్‌కు సమీపంలోని చెట్ల కొమ్మలు తొలగిస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ధర్మపురి: ధర్మపురిలోని జైనా 33 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో ఫీడర్ మెయింటెనెన్స్ పనులు చేపడుతున్నందున మంగళవారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ రవి తెలిపారు. జైనా, నక్కలపేట, దోనూర్, దొంతాపూర్, మగ్గిడి, ఎడపెల్లి, దొంకేశ్వరం, రాజారం, కోసునూర్‌పల్లె, గాదెపెల్లి, తీగలధర్మారం తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

పాఠశాలలకు నోట్‌బుక్స్ పంపిణీ



ఇబ్రహీంపట్నం ఎమ్మార్సీ నుంచి నోట్‌బుక్స్ తీసుకెళ్తున్న ఉపాధ్యాయులు

ఇబ్రహీంపట్నం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు ప్రభుత్వం నోట్‌బుక్స్ సరఫరా చేయగా.. ఎమ్మార్సీ కార్యాలయానికి చేరాయి. సోమవారం అధికారులు 19,995 నోటు పుస్తకాలను పంపిణీ చేయడంతో ఉపాధ్యాయులు ప్రత్యేక వాహనాల్లో తీసుకెళ్లారు. సీఆర్పీ రవీందర్, ఎమ్ఐఎస్ కార్తీక్, కంప్యూటర్ ఆపరేటర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సారంగాపూర్: మండలంలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థుల కోసం విద్యావనరుల కేంద్రంలో ఎంఈవో భీమయ్య సోమవారం నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. సారంగాపూర్ హెచ్‌ఎం కిశోర్ తదితరులు పాల్గొన్నారు.